నీతి ఆయోగ్ గుర్తింపుపై హర్షం

కలెక్టరేట్, జూలై 27 : తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పయనించడాన్ని నీతి ఆయోగ్ గుర్తించడంపై తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపి హర్షం వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని గణేశ్‌నగర్‌లో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. స్వరాష్ట్రం సిద్ధించిన అనంతరం పదేళ్లుగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సుస్థిరాభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం చిత్తశుద్ధితో పనిచేసినట్లు నీతి ఆయోగ్ ప్రశంసించడం, ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఆయన విజన్, తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలతోనే తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందినట్లు వెల్లడించడం, రాష్ట్ర అభివృద్ధి కోసం తొలి సీఎం కేసీఆర్ చేసిన కృషిని తేటతెల్లం చేస్తున్నదన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు రఘురామ్, తేజస్వి, వెంకట్‌యాదవ్, మార్క శ్రీను, మంజునాథ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

స్టోర్స్‌లో సరిపడా మెటీరియల్: ఎన్పీడీసీఎల్ సీఈ

ముకరంపుర, జూలై 27: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలోని డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో ట్రాన్స్ మిషన్, డిస్ట్రిబ్యూషన్ కొత్త సర్వీస్‌ల మంజూరుకు సరిపడా మెటీరియల్ అందుబాటులో ఉందని ఎన్పీడీసీఎల్ సీఈ(హెచ్ ఆర్డీ) టీ మధుసూదన్ తెలిపారు. సర్కిల్ కార్యాలయంలోని స్టోర్స్‌ను శనివారం తనిఖీ చేశారు. వివిధ రకాల మెటీరియల్స్‌ను పరిశీలించారు. ట్రాన్స్ మిషన్ డిస్ట్రిబ్యూషన్, తదితర పనులకు సంబంధించిన అన్ని రకాల మెటీరియల్ స్టోర్‌లో అందుబాటులో ఉందన్నారు. కొత్త వ్యవసాయ కనెక్షన్లు, గృహ, గృహేతర సర్వీసులకు సంబంధించిన మీటర్లు ఇతర సామగ్రి సిద్ధంగా ఉందని చెప్పారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తుగా పనులు చేపట్టేందుకు సరిపడా మెటీరియల్ అందుబాటులో ఉంచామని చెప్పారు. రాబోయే అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. సీఈ వెంట కరీంనగర్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈలు (టెక్నికల్) విజయేందర్, రాజం, తిరుపతి, రఘు, ఏఈ లు ఉన్నారు.

ముందు జాగ్రత్తతో హెపటైటిస్ నుంచి రక్షణ

వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

విద్యానగర్, జూలై 27 : ముందు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల హెపటైటిస్ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని మెడికవర్ హాస్పిటల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ ప్రణీత్ తెలిపారు. వరల్డ్ హెపటైటిస్ డేను పురస్కరించుకొని శనివారం మెడికవర్ హాస్పిటల్‌లో పేషెంట్లకు సిబ్బందికి హెపటైటిస్ ఏ, బి వ్యాధి ఉచిత నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 120 మందికి ప్రత్యేక కిట్ల ద్వారా ఉచితంగా పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ, కాలేయంపై ప్రభావం చూపే వైరల్ హెపటైటిస్‌ను తొలి దశలోనే గుర్తించేందుకు పేషెంట్లు, సిబ్బందికి ఉచిత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. హెపటైటిస్ – ఏ కలుషితమైన ఆహారం, నీరు లేదా సోకిన వ్యక్తితో సన్నిహిత సంబంధం ద్వారా సంక్రమిస్తుందన్నారు. ఈ వ్యాధులతో కాలేయ క్యాన్సర్ సహా కామెర్లు, అలసట, కడుపు నొప్పి, వికారం, జ్వరం, రోగనిరోధక శక్తి, బరువు తగ్గడం, దురద సమస్యలు వస్తాయన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ తాహా, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, ల్యాబ్ ఇన్‌చార్జి రాజు, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్, హెచ్‌ఆర్ హెడ్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అవగాహన

తిమ్మాపూర్, జూలై 27: రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో టీబీ వ్యాధిపై టీబీ జిల్లా కోఆర్డినేటర్ అశోక్ అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్సకు సంబంధించిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు కోటీశ్వర్లు కావాలి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

- 'మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి

చొప్పదండి, జూలై 27: స్వశక్తి మహిళలను మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కోటీశ్వర్లను చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని నవ భారతి మండల సమైక్య కార్యాలయంలో మహిళా శక్తి కార్యక్రమంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఉత్పత్తులను తయారు చేస్తూ ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరఫున సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలెక్టర్ మాట్లాడారు. వారు చేస్తున్న ఉపాధి పనులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌డీవో శ్రీధర్, అదనపు డీఆర్‌డీవో సునీత, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తహసీల్దార్ నరేందర్, డీపీఎంలు ప్రవీణ్, రమణారావీందర్, ఏపీఎం నర్మదా, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు

కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్

ముకరంపుర, జూలై 27: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉన్నట్లు కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. సరఫరాకు ఇబ్బంది ఉన్న ప్రాంతాల్లో సిబ్బంది తక్షణమే స్పందించి పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు. సర్కిల్ పరిధిలో నాలుగు నెలల్లో 128 వంగిన, 78 తుప్పు పట్టిన స్తంభాలు, 196 వదులుగా ఉన్న 9800 మీటర్ల లైన్లు, 208 స్టే వైర్లు మార్చామని, కొంత మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యుత్ శాఖకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్న తరుణంలో సరఫరాలో అంతరాయాలు లేకుండా శ్రమిస్తున్న అధికారులు, సిబ్బందిని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అభినందించారని ఎస్ఈ తెలిపారు. సమస్యలు ఉన్న చోట తక్షణమే స్పందించి సరఫరాను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్న సిబ్బంది సేవలు అభినందనీయమని కొనియాడారు.

సీసీ రోడ్లను ప్రారంభించిన కేంద్రమంత్రి

గంగాధర, జూలై 27: మండలంలోని చెర్లపల్లి(ఆర్) గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సుద్దాల దేవయ్య, బొడిగ శోభ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్, మండలాధ్యక్షుడు కోల అశోక్, నాయకులు వైద రామానుజం, దూలం కళ్యాణ్, తూమ నారాయణ, మల్లాల వినయ్‌సాగర్, ఏడవెల్లి శశిధర్‌రెడ్డి, ఎట్టెపు కనకయ్య, రేండ్ల శ్రీనివాస్, ఆకుల మనోహర్ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణపై వినతి

శంకరపట్నం, జూలై 27: కేశవపట్నం నుంచి పాపయ్యపల్లి మీదుగా సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ వరకు బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని మండల బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు శనివారం వారు కరీంనగర్‌లో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేశవపట్నం గ్రామంలో ఇరుకైన రోడ్డుతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో రోడ్డు విస్తరణతో పాటు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి మొగిలిపాలెం వరకు రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరినట్లు తెలిపారు. అలాగే అర్కండ్ల వాగుపై వంతెన నిర్మించాలని కోరినట్లు చెప్పారు. వెంటనే స్పందించిన మంత్రి సీఆర్ఎఫ్ నిధుల నుంచి మొదటి ప్రాధాన్యతగా విడుదల చేయించనున్నట్లు హామీ ఇచ్చారని వెల్లడించారు. ఇక్కడ బీజేపీ మండలాధ్యక్షుడు ఎనుగుల అనిల్, నాయకులు మాడ వెంకట్‌రెడ్డి, అలివేలి సమ్మిరెడ్డి, దండు కొమురయ్య, ఖాజాపాషా, రాసమల్ల శ్రీనివాస్, గూల్ల రాజు తదితరులు ఉన్నారు.

కృష్ణమాచార్యులకు నివాళి

కమాన్‌చౌరస్తా, జూలై 27 : ఇటీవల పరమపదించిన త్రిదండి శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్ స్వామి (కలువకుంట కృష్ణమాచార్యులు)కి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నివాళులర్పించారు. సప్తగిరికాలనీలో ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సంస్మరణ ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. స్వామీజీ కుమారుడు కలువకుంట రామకృష్ణతో పాటు పూర్వాశ్రమ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం సంజయ్ మాట్లాడుతూ, స్వామివారి సమగ్ర సాహిత్యం సార్వజనీనం కావాలన్నారు. స్వామీజీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలి

తెలంగాణచౌక్, జూలై 27: మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లో ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కోశాధికారి పుణ్యావతి డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఎం కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు రెండో రోజు శనివారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో మహిళలను విస్మరించారన్నారు. లైంగిక వేధింపులు, దాడులను అరికట్టడానికి పటిష్ట చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు అన్నపూర్ణ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మానకొండూర్, జూలై 27: నిషేధిత గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిపై శనివారం మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయంత్రం సదాశివపల్లి స్టేజీవద్ద పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామానికి చెందిన సంగ వినయ్ ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వైపు వెళ్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయిని తరలిస్తున్నట్లు అంగీకరించాడు. సిబ్బంది వినయ్‌ను స్టేషన్‌కు తరలించారు. అతడి వద్ద లభించిన 240 గ్రాముల గంజాయితో పాటు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

కమాన్‌చౌరస్తా, జూలై 27: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ కే రవీందర్ రెడ్డి అధ్యక్షతన న్యాయ సేవా సదస్సు ఉమెన్ సెంట్రిక్ స్కీమ్స్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ హాజరై, వివిధ చట్టాల గురించి వివరించారు. షీ టీం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత స్మార్ట్ ఫోన్ ఉపయోగాలు, అనర్థాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ జి. వెంకట రాజిరెడ్డి, స్వప్న, శ్రీలత, మాధవి, లత, పూజ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను బద్నాం చేయాలనే కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం

- బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, జూలై 27: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న ఆలోచనతోనే కాళేశ్వరం ప్రాజెక్టులపై కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారాలు చేశారని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరంపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలన్నీ అబద్ధాలేనన్నారు. వారు కళ్లు ఉండి కూడా చూడలేని కబోధులుగా మారారని దుయ్యబట్టారు. మేడిగడ్డలో ఒక పిల్లర్ కుంగిపోతే దానిని భూతద్దంలో పెట్టి చూపిస్తూ మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోయిందని అసత్య ప్రచారాలతో నిజం చేయాలని చూశారని విమర్శించారు. ప్రస్తుతం లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహంతో నిండు కుండలా ఉన్న మేడిగడ్డ సాక్ష్యంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎప్పుడూ రాజకీయ ప్రయోజనాలే తప్ప రైతుల ప్రయోజనాలు పట్టవన్నారు. ఓవైపు రైతుల పంటపొలాలు ఎండిపోతున్నా ప్రాజెక్టులో నీరు ఎత్తిపోయడం లేదని ధ్వజమెత్తారు. మిడ్ మానేరు, లోయర్ మానేరు జలాశయాలు నీరు లేక డెడ్ స్టోరేజీకి చేరాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భేషజాలకు పోయి నీటిని వదలడం లేదన్నారు. ప్రాజెక్టులపై కనీస అవగాహన లేని సుడా చైర్మన్ ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనం వృథా అయిందని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పదవులు రాగానే అడ్డగోలుగా విమర్శలు చేస్తే సరిపోదని, విషయ పరిజ్ఞానం తెలుసుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మిడ్ మానేరు, లోయర్ మానేరు జలశయాలను గతేడాది జూలై నాటికి నీటిని నింపగా అవి నిండుకుండలా మారడంతో గేట్ల ద్వారా దిగువకు వదిలామని గుర్తు చేశారు. గతేడాది వరకు నగరవాసులకు ప్రతిరోజు మంచినీటి సరఫరా చేశామని, ఇప్పుడు తాగునీరు కూడా అందించే పరిస్థితి లేదన్నారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి సుడా చైర్మన్‌కు లేదన్నారు. రాజకీయ కక్షతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. రైతుల సంక్షేమం కోసం నీటి విడుదల విషయంలో దృష్టి పెట్టాలని హితవు పలికారు.

అక్షయ చదువుకుంటావా..

- వానలో నాట్లు వేస్తున్న బాలికకు కేంద్ర మంత్రి భరోసా

చెర్లపల్లి(ఆర్) వద్ద బాలిక అక్షయతో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

గంగాధర, జూలై 27 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఓ బాలికకు భరోసానిచ్చారు. శనివారం చెర్లపల్లి(ఆర్)లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని వెళ్తూ.. రోడ్డు పక్కన వానలో నాటు వేస్తున్న మహిళలను చూసి ఆయన ఆగారు. వారితో మాట్లాడి గ్రామాల్లో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీల్లో బాలికను గమనించిన మంత్రి ఆమెతో మాట్లాడారు. 'ఏం తల్లీ.. పనికి వెళ్తున్నావు. బడికి వెళ్లడం ఇష్టం లేదా?' అని ప్రశ్నించారు. కాగా, తన పేరు బోళ్ల అక్షయ అని, పదో తరగతి వరకు చదువుకున్నానని, ఆపై చదవడానికి ఆర్థిక స్థోమత లేక కూలి పనులకు వెళ్తున్నానని, తనకు చదువుకోవాలని ఉందని తెలిపింది. దీంతో స్పందించిన సంజయ్, అక్షయను హాస్టల్‌లో చేర్పించి చదివిస్తామని హామీ ఇచ్చారు. అక్కడే ఉన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డిని పిలిచి బాలికను కాలేజీలో చదివించడంతోపాటు హాస్టల్లో చేర్పించాలని ఆదేశించారు. కాగా, తనను చదివిస్తానని హామీ ఇచ్చిన మంత్రికి అక్షయ కృతజ్ఞతలు తెలిపింది.

కన్న కృష్ణను సన్మానిస్తున్న మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా కన్న కృష్ణ

తెలంగాణచౌక్, జూలై27: ఆర్యవైశ్య మహాసభ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా నగరానికి చెందిన కన్న కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్యవైశ్య జిల్లా కమిటీకి జరుగుతున్న ఎన్నికల్లో శనివారం నామినేషన్ల ముగింపు వరకు కన్న కృష్ణ ఒక్కరే పోటీలో ఉండడంతో జిల్లా అధ్యక్షుడిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం నాయకులు ప్రకటించారు. కాగా, ఆయన నివాసంలో కన్న కృష్ణను మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, నాయీబ్రాహ్మణ ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్, మాజీ కౌన్సిలర్ సాదవేణి శ్రీనివాస్ శాలువా కప్పి సన్మానించారు, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

సైదాపూర్, జూలై 27: ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ఆసరి పెద్దకనకయ్య ఇటీవల మృతిచెందగా, శనివారం ఆయన కుటుంబానికి ఎక్లాస్‌పూర్ మాజీ సర్పంచ్ కొత్త రాజిరెడ్డి, వెన్కేపల్లి-సైదాపూర్ సింగిల్‌విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, ఆయన సోదరులు కొత్త నారాయణరెడ్డి, కొత్త నాగిరెడ్డి రూ.20 వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

విద్యాలయానికి పుస్తకాల ర్యాకుల వితరణ

రామడుగు, జూలై 27 : వెదిర ఉన్నత పాఠశాలలో 1971 నుంచి 1981 వరకు విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు సుమారు రూ.20 వేల విలువైన నాలుగు పుస్తకాల ర్యాకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, పెద్దపల్లి ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ బీరెడ్డి ప్రేమ్‌సాగర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల పూర్వ విద్యార్థులు ఆయా పాఠశాల్లో ఆధునిక సౌకర్యాల రూపకల్పన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కెశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ విశ్రాంత ఉద్యోగి వంచ వెంకటరెడ్డి, ఆర్టీసీ ఉద్యోగి మల్లారెడ్డి, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమ్మర్ అలవెన్స్ చెల్లించాలి

కలెక్టరేట్, జూలై 27 : ఉపాధి హామీ కూలీలకు చెల్లించాల్సిన వేసవి భత్యం వెంటనే విడుదల చేయాలని ఉపాధి కూలీల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజు డిమాండ్ చేశారు. ఓవైపు వర్షాలు, మరోవైపు పనిలేక కుటుంబ పోషణకు కూలీలు నిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు ప్రతిరోజు పే స్లిప్పులు అందజేయాలని, హాజరు పట్టికలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా, పారదర్శకతను పాటించేలా తగు చర్యలు తీసుకోవాలని శనివారం కలెక్టర్‌కు అందించిన వినతిపత్రంలో కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు వెంకటేశ్, పురమల్ల రాజేశ్వర్, పెద్ది మనోహర్, దుర్గం బుచ్చయ్య తదితరులున్నారు.

'గంగ దర్వాజ' సాహిత్యానికి కొత్త చేర్పు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నలిమెల భాస్కర్ తదితరులు

కమాన్‌చౌరస్తా, జూలై 27 : 'గంగ దర్వాజ' తెలంగాణ సాహిత్యరంగానికే కాక మొత్తం తెలుగు సాహిత్యానికి ఒక మంచి చేర్పు అని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ పేర్కొన్నారు. కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ మట్టా సంపత్ కుమార్ రెడ్డి రచించిన గంగ దర్వాజ పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి ఈ మూడింటికి గంగ దర్వాజ ఒక ముఖద్వార మని, వర్తమాన కాలానికి ఇది అవసరమైన పుస్తకం అని విశ్లేషించారు. స్థానిక తెలుగు అధ్యాపక సాహితీ వేత్తలు, పరిశోధకులు, డాక్టర్ మాదాడి నారాయణ రెడ్డి, డాక్టర్ బొద్దుల లక్ష్మయ్య, డాక్టర్ మచ్చ హరిదాసు, బొల్లి వరలక్ష్మి, కడారి సాయిసురేశ్, సభాధ్యక్షురాలు కళాశాల ప్రధానాచార్యులు తూములూరి శ్రీలక్ష్మి గంగ దర్వాజ పుస్తక గుణశీలతలపై విశ్లేషణ చేశారు. కార్యక్రమంలో పుస్తక రచయిత డాక్టర్ మట్టా సంపత్ కుమార్ రెడ్డి తమ రచనల నేపథ్యాన్ని కూలంకషంగా వివరించారు. కార్యక్రమంలో వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు, సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

వర్షంలో వంటావార్పు

గర్భకుర్తిలో వంటావార్పు నిర్వహిస్తున్న కార్మికులు

గంగాధర, జూలై 27 : పవర్‌లూమ్స్ వస్త్ర పరిశ్రమకు వస్త్రోత్పతి ఆర్డర్లు కల్పించి ఆదుకోవాలని మండలంలోని గర్భకుర్తి పవర్‌లూమ్స్ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శనివారం మూడో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా గ్రామంలోని బీటీ చౌరస్తా వద్ద కార్మికులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఆదుకోకుంటే తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ వృద్ధాశ్రమ సందర్శన

కలెక్టరేట్, జూలై 27 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ వృద్ధులు, వికలాంగుల ఆశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికారి, సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేశ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలితో మాట్లాడుతూ, వృద్ధులకు రుచికరమైన వంటలు వండాలని, వర్షాకాలంలో ఎలాంటి వ్యాధులు రాకుండా ఎల్ల వేళలా వారి ఆరోగ్య పరిస్థితులను గమనించాలని సూచించారు. న్యాయ సేవ అవసరమైన వారు తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేశ్, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

అంబాల్‌పూర్ ఊర చెరువుకు గండి

శంకరపట్నం, జూలై 27: అంబాల్‌పూర్ ఊర చెరువుకు గండి పడింది. దీంతో దిగువన గల కేశవపట్నం చించెరుకుంటలోకి నీరు పోతున్నది. గతంలో నిర్మించిన చెక్ డ్యాంల ఎత్తును పెంచక మధ్యలోనే ఆపడంతో కట్ట కోతకు గురై గండి పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎస్సారెస్పీ అధికారులు వెంటనే తగిన మరమ్మతు పనులు చేపట్టి నీరు నిల్వ ఉండేలా చూడాలని కోరుతున్నారు.

మిస్సైన వ్యక్తి మృతదేహం లభ్యం

మానకొండూర్, జూలై 27: ఈ నెల 25న మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని సదాశివపల్లి డివిజన్‌కు చెందిన గాలిపల్లి శంకర్ (40) వృత్తిరీత్యా పెయింటర్. ఈనెల 25న కరీంనగర్‌లో కూరగాయలు తీసుకువస్తానని ఇంట్లో నుంచి వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. అదే రోజు మానేరు తీగల వంతెన సమీపంలోని చెక్‌డ్యాం వద్ద శంకర్ బట్టలు, చెప్పులు గుర్తించగా శనివారం అతడి మృతదేహం లభించినట్లు సీఐ తెలిపారు.

నగరంలో పరిశుభ్రతను పాటించాలి

కార్పొరేషన్, జూలై 27: నగరపాలక సంస్థ పరిధిలో అన్ని వీధుల్లోనూ పరిశుభ్రతను పాటించేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ప్రపుల్ దేశాయ్ అన్నారు. శనివారం నగరం